విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 07, ఆగస్టు 2023

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరించిన ఎస్ఓ శిల్పను సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర - డి.హీరేహాళ్ : మండల కేంద్రంలో ఉన్న కేజీబీవి పాఠశాలలో విద్యార్థుల పట్ల నిర్లక్ష్య వ్యవహరించిన ఎస్ఓ శిల్పని తక్షణమే సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు అంజి, ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షుడు కుమార్ నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివలు మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం హీరేహాళ్ మండలం కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో కేజీబీవీలో పోషకాహారంలో నాణ్యత పాటించకుండా విద్యార్థులు తినే భోజనంలో పురుగులు రావడంతో అప్పటినుంచి ఫుడ్ పాయిజాన్ అయి పదిమంది విద్యార్థులు అస్వస్థకు గురి అయినారన్నారు. పలు పేపర్లలో, సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో సమాచారం తెలుసుకున్న విద్యార్థి యువజన సంఘాల నాయకులు ఆదివారం కేజీబీవీ పాఠశాలకు వెళ్లి విద్యార్థుల దగ్గర మాట్లాడి సమస్యలు తెలుసుకుని తనిఖీ చేశారు. దీనిపైన ఉన్నత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని, తూతూ మంత్రంగా ఇక్కడ అధికారులు విచారణ చేపడుతున్నారన్నారు. ఇది సరైన పద్ధతి కాదని, రాష్ట్ర ప్రభుత్వం బాలికలకు పౌష్టిక ఆహారం ఎంతో ఖర్చుతో కూడుకొని విద్యార్థులకు నాణ్యతగా అందించాలని ఇస్తే ఇక్కడ యాజమాన్యం మాత్రం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వారు ఆరోగ్యం పట్ల శాపంగా మారుతున్నా రన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఇలాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని విద్యార్థి యువజన సంఘాలుగా డిమాండ్ చేశారు. విద్యార్థినిలు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన కేజీబీవీ మండలం ఎస్ఓ శిల్పని సస్పెండ్ చేసేంతవరకు ఉద్యమాలు చేస్తామని ఈ సందర్భంగా అధికారులకు తెలియజేశారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్ విద్యార్థి యువ జన సంఘాల నాయకులు అభి లోకేష్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ కార్యాలయంలో గద్దర్ సంతాప సభ

విశాలాంధ్ర - ఉరవకొండ : ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల ఉరవకొండ నియోజకవర్గ సీపీఐ నాయకులు సంతా పాన్ని తెలియజేశారు. పార్టీ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, సీనియర్ నాయకులు శివన్న మాట్లాడుతూ పేద బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం అలుపెరుగని ఎన్నో పోరాటాలు చేసిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని కొని యాడారు. తన కళను సామాజిక మార్పు తీసుకురావ డానికి భారతదేశంలోని ఆర్థిక, రాజకీయ అంశాలపై ప్రజల్లో చైతన్యవంతం తీసుకురావడానికి ఎంతగానో ఉపయోగపడిందన్నారు. అలాంటి వ్యక్తి మృతి పేద, బడుగు, బలహీన వర్గాలకు తీరని నష్టం కలిగిందన్నారు ఆయన ఆత్మకు శాంతి కలగాలని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సోమవారం ఉదయం స్థానిక సీపీఐ కార్యాలయంలో ప్రజా గాయకుడు గద్దర్ సంతాప సభను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సంతాప సభలో కవులు,కళాకారులు,వామపక్షాలనాయకులు సానుభూతిపరులు పాల్గొనాలని తెలిపారు.

దళితులపై దాడులు అరికట్టాలి

విశాలాంధ్ర-ఉరవకొండ : రాష్ట్రంలో దళితులపై దాడులు జరుగుతు న్నప్పటికీ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్పందించడం లేదని ఎమ్మార్పీఎస్ రాయలసీమ ప్రతినిధి అక్కులప్ప, జిల్లా అధ్యక్షు లు ఎం రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కౌకుంట్ల రవి పేర్కొన్నారు. ఆదివారం ఉరవకొండ లోని రోడ్డు భవనాల అతిథి గృహంలో వారు విలేకరులతో మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులు ఆపాలని దాడులకు పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్గీకరణ మీద ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదని విమర్శించారు. 2024 ఎన్నికలలో ఏ పార్టీ అయితే వర్గీకరణకి కట్టుబడి మాట ఇస్తారో వారికే మా మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఉరవకొండ తాలూకా గౌరవ అధ్యక్షుడు గంగాధర్, తాలూకా అధ్యక్షుడు రాంపురం చెన్నప్ప,తాలూకా ప్రధాన కార్యదర్శి కౌకుంట్ల సురేష్,తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో జరిగిన విధ్వంసానికి చంద్రబాబు కారణం

విశాలాంధ్ర-ఉరవకొండ : పుంగనూరులో జరిగిన అల్లర్లకు విధ్వంసానికి టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు కారణమని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఆరోపించారు. ఆదివారం ఉరవకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్ర బాబు రోడ్డు షోకు అనుమతి లేకపోయినప్పటికీ కావాలని రౌడీ మూకలను వెనకేసుకొచ్చి విధ్వంసం సృష్టించాడన్నారు. పుంగనూరులో జరిగిన ఘర్షణకు కారణం వైయస్ఆర్ సీపీ కార్యకర్తలేనని టీడీపీ అనుకూల మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని, ఆ సమయంలో వైయస్ ఆర్ సీపీ కార్యకర్త ఒక్కరూ కూడా ఘటనా స్థలంలో లేరని స్పష్టం చేశారు. పోలీసులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమ పార్టీ అధికారంలో లేకపోతే విధ్వంసాన్ని సృష్టించాలని, హింసను ప్రోత్సహించాలని తద్వారా ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనేమనస్తత్వం చంద్రబాబుది అన్నారు. రాయలసీమలో దుర్భిక్ష పరిస్థితులకు చంద్రబాబునాయుడు కారణమన్నారు. రాయలసీమను సస్యశ్యామలం చేయాలని, నీరు అందించాలని సీఎం వైయస్ జగన్ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు తీసుకువచ్చారని వీటిలో మొదటి దశ అయిన లిఫ్ట్ కొంత వరకు ముందుకు వెళ్లింది. ఈ క్రమంలో అందరినీ రెచ్చగొట్టి ఎన్జీటీకి పంపించి ప్రాజెక్టుపై స్టే తీసుకువచ్చి ఇవాళ వెళ్లి రాయలసీమకు అన్యాయం జరుగుతుందని చంద్రబాబు మాట్లాడుతున్నాడని ఆరోపించారు. ప్రాజెక్టుల గురించి మాట్లాడకుండా ముఖ్యమంత్రి, మంత్రులను ఉద్దేశించి వ్యక్తిగత విమర్శ లు చేసి రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించడం సిగ్గుచేటు అన్నారు.నిత్యం ప్రజా సేవకి అంకితమైన మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డిని చంద్రబాబు నాయుడు ఇష్టారాజ్యంగా మాట్లాడడం తగదన్నారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

దాసు మరణం హమాలీ యూనియన్‌కు తీరనిలోటు

విశాలాంధ్ర - జేఎన్టీయూఏ : ఐఎంఎఫ్ఎల్ హమాలీ యూనియన్‌కు దాసు మరణం తీరనిలోటు అని ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి పేర్కొన్నారు. నీలం సంజీవరెడ్డి భవనంలో సంతాప సభ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ.. కార్మిక హక్కుల కోసం కృషి చేశారని.. పదవులకు ఆశించకుండా కార్మిక అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణుడు,అధ్యక్షులురమేష్,జయరాం,కార్మికులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో చేరిక

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం చాబాల గ్రామానికి చెందిన యువత నరేంద్ర, రాజు విజయ్, రాజశేఖర్, శివకుమార్, అంజి, మోహన్ రాజేష్, ఆంజనేయులు, విష్ణు తదితరులు ఆ పార్టీ మం డల అధ్యక్షులు అచ్చునాల కేశవ్ ఆధ్వర్యంలో ఆదివారం జనసేన పార్టీలో చేరారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు ఆ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలు చేరుతున్నట్టు వారు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షులు కేశవ్ మాట్లాడుతూ కొత్తగా చేరిన యువత జనసేన పార్టీ అభివృద్ధి కోసం పాటువడాలని గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి అన్నారు.

కాలువలో నీరు లేక ఆయకట్టు రైతుల ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో - అనంతపురం : ఏళ్ళ తరబడి అనంతపురం జిల్లా హెచ్ఎల్‌సి ఆయకట్టు పిల్ల కాలువలు మరమ్మత్తులకు నోచుకోవడం లేదని దీంతో పంటలు పండక రైతులు ఆందోళన చెందుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం నీలం రాజశేఖర రెడ్డి భవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.పిల్ల కాలువల్లో నీరు లేకపోవడంతో తుంగభద్ర ఎగువ కాలువ కింద ఉన్న ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు.ఇప్పటికే 20రోజులు ఆలస్యమైందని సకాలంలో నీరు రాకపోవడంతో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. 105వ కిలోమీటర్ వద్ద నుండి బొమ్మనహాలు, కనేకల్ మండలాలతో పాటు ఉరవకొండ మండలంలోని జిబిసి, వరకు 80కిలోమీటర్ల పొడవునా కాలువగట్లు బలహీనంగా తయారయ్యాయని ఏకరువు పెట్టారు. ఆధునీకరణ పనులు చేపట్టక పోవడంతో కంపచెట్లు విపరీతంగా పెరిగి కాలువలన్ని అధ్వాన్నస్థితికి చేరుకున్నా యని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమది రైతు ప్రభుత్వమని చెప్పుకునే సీఎం జగన్ కు అన్నదాతలపై ఇసుమంతైనా ప్రేమ లేకుండా పోయిందని విరుచుకు పడ్డారు.హెచ్.ఎల్.సి, ప్రధాన కాలువకు అనుబంధంగా ఉన్న 15 డిస్ట్రిబ్యూటరీల పరిధిలోని పిల్ల కాలువలు మరమ్మతులకు నోచుకోలేదన్నారు. తుంగభద్ర ఎగువ కాలం కింద వదిలిన నీరు కేవలం పీఏబీఆర్‌కు వస్తున్న తాగునీరు మాత్రమేనన్నారు.పంట పొలాలకు ఏ మాత్రం నీరు ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాని కలెక్టర్ చొరవ తీసుకొని వెంటనే తుంగభద్ర కింద ఉన్న ఆయుకట్టుకు నీరు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాయలసీమకు వరప్రసాదిలాంటి హంద్రీనీవా ప్రాజెక్టుతో 6లక్షల ఎకరాలకు తాగుసాగునీరు అందుతుందన్నారు. అంతే కాకుం డా మహత్తరమైన పథకం అనంతపురం జిల్లా తోపాటు సత్య సాయి జిల్లాలో లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు.తక్షణం తుంగభద్ర హంద్రీనీవా కు సంబంధించిన సూపరింటెండెంట్ ఇంజనీర్లు స్పందించాలని ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సిందేనని తేల్చి చెప్పారు.లేనిపక్షంలో సిపిఐ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలకువెనుకాడమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఎంపీ తలారి రంగయ్యను కలిసిన వైసీపీ నాయకులు

విశాలాంధ్ర - ఉరవకొండ : అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను ఆదివారం ఉరవ కొండ, విడపనకల్లు మండలాలకి చెందిన వైసీపీ నాయకులు కలిశారు. ఉరవకొండ నియోజ కవర్గంలో ఇప్పటికే హిందూ స్మశాన వాటికలు మరియు రోడ్ల అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి కోరిన వెంటనే నిధులు మంజూరు చేయడం పట్ల ఎంపీకి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. మరిన్ని ఎంపీ నిధులనుతమ మండలాలలో అభివృద్ధి పనులకు కేటాయించా లని వైసిపి నాయకులు విజ్ఞప్తి చేశారు. దీనికి ఎంపీ తలారి రంగయ్య కూడా సానుకూలంగా స్పందించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో విడపనకల్లు మాజీ జెడ్పిటిసి సభ్యులు తిప్పయ్య, మండల కన్వీనర్ బసన్న, ఉరవకొండ వైస్ ఎంపీపీ నరసిం హులు, ఉరవకొండ ఉపసర్పంచ్ వన్నప్ప, వైఎస్ఆర్సిపి పార్టీ బీసీ విభాగం నాయకులు వెలగొండ నాగప్ప, ఉలిగప్ప, మరియు ఇంద్రావతి గ్రామానికి చెందిన డాక్టర్ శ్రీరాములు తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటిన జై కిసాన్ ఫౌండేషన్

విశాలాంధ్ర-ఉరవకొండ : అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం స్థానిక కిసాన్ ఆగ్రో సొ ల్యూషన్స్ ఆఫీస్ ప్రాంగణంలో జై కిసాన్ ఫౌండేషన్ సంస్థ మొక్కలు నాటింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు మాట్లాడుతూ మొక్కలతో స్నేహం చేయాలని వీటి స్నేహం వల్ల ఆరోగ్యం, ఆనందం, ఆయుష్షు కలుగు తుందని ప్రతి ఒక్కరు కూడా మొక్కలు నాటి ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు రమేష్ కోమల, లక్ష్మీ కళ, సురేంద్ర, నిస్వార్థ వెంకట్, శ్రీమతి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ)విస్తృత సమావేశం

విశాలాంధ్ర - కణేకల్లు : కనేకల్లు పట్టణంలో గల సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఉదయం సీపీఐ విస్తృత సమావేశంను సీపీఐ నాయకులు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం. గౌస్ పీర్ ఆధ్వర్యంలో నిర్వహించగా విస్తృత సమావేశం పార్టీ అభివృద్ధి, నిబంధనల విషయాలపై చర్చలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కార్యవర్గ సభ్యులు, కార్మిక సంఘం నాయకులతో రాబోయే ఎన్నికల విషయం పై సీపీఐ అన్ని పార్టీలతో పోటీ చేస్తూ వచ్చే ఎన్నికలలో పోటీ చేయడానికి సీపీఐ ముందు ఉంటుందని, అదేవిధంగా మన భారతదేశంలో ఆనాటి చరిత్ర తీర్గ రాస్తే మన భారత దేశంలో ప్రతిపక్షంలో ఉన్న ఉన్నటువంటి ఏకైక కమ్యూనిస్టు పార్టీ మరియు ఇప్పుడు చూసే కార్పొరేటర్ పెత్తందారుతో జతకట్టి మన భారతదేశాన్ని 150కోట్ల జనాన్ని ఓటుకు నోటుకుంటూ అధికారం పీఠం ఎక్కుతున్నారు. అప్పట్లో ప్రేమానురాగాలతో పేదవానికి అన్ని విధాలుగా ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల కోసం, వారి వారి ఉద్యోగాల కోసం మరియు పాదికోసం శ్రమపడి నాయకులు పేదల కోసమే రాజకీయాలు చేస్తూ ప్రజల పక్షాన ఉంటూ ప్రజలకు న్యాయం జరిగేంత వరకు పోరాటాలు సాధించేంతవరకు పోరాడే ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ, ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం మణిపూర్ లో ఉన్న బిజెపి ప్రభుత్వం మరియు అక్కడ పెద్ద ఎత్తున విద్వేషం జరిగిన మరియు మహిళల పైన అత్యాచారాలు జరిగిన ప్రజలకు రక్షణ కల్పించలేని, ప్రభుత్వం ఈ బీజేపీ ప్రభుత్వం రాబోయే రోజుల్లో చిత్తుగా ఈ బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించి డిపాజిట్లు కూడా లేకుండా చేస్తామని, మరి అయితే ఏపీ ఆంధ్రప్రదేశ్ లో జగన్‌పాలన కూడా అదే బాటలో నడుస్తున్నదని, మన ఆంధ్ర ప్రదేశ్లోలా అండ్ ఆర్డర్ కనుమరుగుతూ రౌడీలు రోడ్లపైకి వచ్చి మహిళల పైన అత్యాచారాలు, మహిళలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. మన ఏపీ లా అండ్ ఆర్డర్ వేగవంతంగా అభివృద్ధి చెందుతుందని చెప్తున్నా మన నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు గొప్పగా చెబుతున్నారన్నారు. మాట ఎత్తితే అబద్ధాలు చెబుతూ వారి పదవులు కాపాడుకుంటూ జగన్మోహన్ రెడ్డి చుట్టూ తిరుగుతూ అభివృద్ధి గాలికి వదిలేసి కేవలం వారి వాటాల కోసమే నిరంతరం కొనసాగిస్తున్నారన్నారు. కాబట్టి సిపిఐ పార్టీగా హెచ్చరిస్తున్నది ఏమిటంటే ఇపుడైనా సకాలంలో అభివృద్ధి చేయాలని, అలా కానియెడల రాబోయే రోజుల్లో మీకు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ అనంతపురం జిల్లా కౌన్సిల్ సభ్యులు గౌస్ పీర్, కనేకల్ మండల సహాయ కార్యదర్శులు ముల్లా శర్మాస్వలి, బషీర్ మాల్యాం శాఖ కార్యదర్శి చందా హుస్సేన్, దళిత హక్కుల మండల కార్యదర్శి జనార్ధన్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఖలీల్ సాబ్, సిపిఐ నాయకులు రాజశేఖర్,భాష పాల్గొన్నారు.

రైతుల ఉద్యమాన్ని ఏ ప్రభుత్వం ఆపలేదు

విశాలాంధ్ర బ్యూరో - అనంతపురం : ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమానికి వెళ్తున్న సిపిఐ రైతు సంఘం నాయకులను జిల్లా వ్యాప్తంగా పోలీసులు వ్యూహాత్మకంగా ఆదివారం అరెస్టు చేశారు.ఈ నేపథ్యంలో ఎపి రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున,రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి రామకృష్ణ,రైతు సంఘం జిల్లా కార్యదర్శి చెన్నప్ప, ఉపాధ్యక్షుడు చలపతి సహా రాయదుర్గంలో అక్రమంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున, రైతు సంఘం నాయకులు తిప్పేస్వామి,దేవరాజులు,ఈరన్న,నరసింహులు, గుంతకల్లు లో రైతు సంఘం నియోజకవర్గం కార్యదర్శి రామాంజనేయులు,పెద్దపప్పూరు లో చింతా పురుషోత్తమ్,పెద్దవడుగూరులో జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు వెంకట్రాముడు యాదవ్,పుట్లూరు మండల కేంద్రంలో జిల్లా రైతు సంఘంజిల్లా ఉపాధ్యక్షుడు శివారెడ్డి, జిల్లా రైతు సంఘం నాయకులు అరటి వేముల గోపాల్ ,సంజీవపురం శేఖర, చిన్నికృష్ణుడు,అన్నయ్య ,ఆత్మకూరులో కౌలురైతుల సంఘం నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సనపరామకృష్ణ, రామాంజనేయులు ,శివ లను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. ఈ విషయంపై ఎపి రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున ఘాటుగా స్పందించారు. విజయవాడలో శాంతియుతంగా ధర్నాలో పాల్గొనడానికి వెళుతున్న రైతులను వెళ్ళనీయకుండా ఈ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో అరెస్టు చేయించడం దారుణమన్నారు.రైతు ఉద్యమాలను అణచివేయాలని చూడడం వైసీపీ ప్రభుత్వ చేతకాని తనమే నని ఎద్దేవా చేశారు.అధికారంలోకి రాకముందు నేను రైతు బిడ్డనని,రైతులకు మేలు చేసే ప్రభుత్వం అనే గొప్పలు చెప్పిన వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేడు రైతుల పాలిట శాపంగా మారాడని మండిపడ్డారు.ఇప్పటికైనా సీఎం జగన్మోహన్ రెడ్డి కళ్లు తెరిచి రైతు సమస్యలపై దృష్టి సారించాలని తెలంగాణ ప్రభుత్వం తరహాలో రైతులకు ఎకరాకు పదివేల రూపాయలు అందించాలని డిమాండ్ చేశారు.జిల్లా వ్యాప్తంగా రైతు సంఘం నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఆత్మకూరు : ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలోరైతుల ధర్నాకు చలో విజయవాడకు తరలి వెళ్లకుండా ఆదివారం పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా రేపు విజయవాడ నగరంలోని ధర్నా చౌక్ దగ్గర శాంతియుతంగా ధర్నా చేయడానికి జిల్లా నుంచి తరలి వెళ్తుంటే ఈ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు ద్వారా రైతు ఉద్యమాలను అణచి వేయాలని చూడడం చాలా అన్యాయం అని దుయ్యబట్టారు. సిపిఐ ఆత్మకూరు మండల సహాయ కార్యదర్శి బండారు శివ, వ్యవసాయ కార్మిక సంఘం రాప్తాడు నియోజకవర్గం ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు,పాల్గొన్నారు.

తాడిపత్రి : పోలీసులు అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సిపిఐ మండల కార్యదర్శి నాగ రంగయ్య రైతు సంఘం నాయకుడు నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మాట్లాడుతూ విజయవాడ నగరంలో సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నాకు, శాంతియుత ర్యాలీకి వెళ్లకుండా అక్రమ అరెస్టు చేయడానికి ఖండిస్తున్నా మన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజా ఉద్యమాలను ఆపడాన్ని మానుకోవాలని హితవు పలికారు.

శెట్టూరు : ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో చలో విజయవాడకు తరలి వెళ్లకుండా ఆదివారం పోలీసులు అక్రమంగా నోటీసులు జారీ చేయడంపై సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మహదేవ్ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా రేపు విజయవాడ నగరంలోని ధర్నా చౌక్ దగ్గర శాంతియుతంగా ధర్నా చేయ దానికి జిల్లా నుంచి తరలి వెళ్తుంటే ఈ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు ద్వారా రైతు ఉద్యమాలను అణచి వేయాలని చూడడం చాలా అన్యాయం అని దుయ్యబట్టారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం అరెస్టుల వల్ల భయ భ్రాంతులకు గురి చేయడం ప్రభుత్వానికి మంచి పద్ధతి కాదుఅని ఇప్పటికైనా శాంతి యుతంగా చేయాలి కావున తక్షణమే అరెస్టులు ఆపాలని రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా రైతు సంఘం తరఫున హెచ్చరించడమైనది.

రాయదుర్గం : రైతు సంఘం మహాగర్జనకు బయలుదేరుతున్న ఏపీ రైతు సంఘం ఇంచార్జ్ నాగార్జున, నాయకులు తిప్పేస్వామి, నర్సింహులను ఆదివారం పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. రాయదుర్గం తాలూకా ఇంచార్జ్ నాగార్జున, గుమ్మఘట మండల ఏపి రైతు సంఘం కార్యదర్శి తిప్పేస్వామిలు మాట్లాడుతూ రైతులను కౌలు రైతులను ఆదుకోవలని, రైతు ఆత్మహత్యలను నివారించాలని, రైతు సంఘం ప్రజా గర్జనకు చలో విజయవాడకు బయలుదేరుతున్న రైతు సంఘం నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు.ప్రభుత్వం పోలీసుల ద్వారా ఉద్యమాలు అణిచివేయడం దుర్మార్గమని, ఉద్యమాలను అరెస్టు ద్వారా అణిచివేయాలని చూస్తే ఉద్యమాలు మరింతగా ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీ రైతు సంఘంగా హెచ్చరిక చేస్తున్నమన్నారు. అరెస్టు అయిన వారిలో సునీల్, ప్రశాంత్, దేవరాజులు, నిరంజన్ తదితరులు ఉన్నారు.

శింగనమల : ఏపీ రైతు సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రైతుల ధర్నాకు రైతులతో కలిసి చలో విజయవాడకు తరలి వెళ్లకుండా పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం చాలా దారుణమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిన్నప్ప యాదవ్ ను ఆదివారం శింగనమల పోలీసులు అరెస్ట్ చేశారు. అక్రమ అరెస్టులపై ఆయన మండిపడ్డారు. అరెస్టుల వల్ల భయభ్రాంతులకు గురి చేయడం ప్రభుత్వానికి మంచి పద్ధతి కాదని, తక్షణమే అరెస్టులు ఆపాలనిలేకుంటే భవిషత్ లో రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల ఆగ్రహముఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

కూడేరు : ఏపీ రైతు సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రైతుల ధర్నాకు రైతులతో కలిసి చలో విజయవాడకు తరలి వెళ్లకుండా ఆదివారం పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం చాలా దారుణం ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బోయ గోపాల్, ఉరవకొండ తాలూకా ప్రధాన కార్యదర్శి కె.మనోహర్ మాట్లా డుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా రేపు విజయవాడ నగరంలోని ధర్నా చౌక్ దగ్గర శాంతియుతంగా చేయడానికి జిల్లా నుంచి తరలి వెళ్తుంటే ఈ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు ద్వారా రైతు ఉద్యమాలను అణచి వేయాలని చూడడం చాలా అన్యాయం దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం. అరెస్టుల వల్ల భయభ్రాంతులకు గురి చేయడం ప్రభుత్వానికి మంచి పద్ధతి కాదు ఇప్పటికైనా శాంతియుతంగా ఆలోచణ చేయాలి కావున తక్షణమే అరెస్టులు ఆపాలనిలేకుంటే భవిషత్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల ఆగ్రహం ఎదుర్కోక తప్పదని జిల్లా రైతు సంఘం తరఫున హెచ్చరించడమైనది.

అనంతపురం రూరల్ : రైతు సమస్యలు పరిష్కరించాలని నేడు విజయవాడలో జరిగనున్న మహా ధర్నాకు వెళ్ళనీయకుండా సీపీఐ నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం దుర్మార్గమని, అరెస్టులతో పోరాటాలను ఆపలేరని ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిరుతల మల్లికార్జున అన్నారు. మల్లికార్జున, రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, ఏఐటీయూసీ నరేష్, రాప్తాడు నియోజకవర్గ రైతు సంఘం సహాయ కార్యదర్శి ఎం.చలపతి, ఆత్మకూరు మండల కార్యదర్శి నీళ్ళపాల రామకృష్ణలకు పోలీసులు ఆదివారం నోటీసులను అందజేశారు. జిల్లా వ్యాప్తంగా రైతులను రైతు సంఘం నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వారు మాట్లాడుతూ నేడు విజయవాడలో శాంతియుతంగా ధర్నా చేయడానికి వెళుతున్న రైతులను వెళ్ళనీయకుండా ఈ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు ద్వారా రైతు ఉద్యమాలను అణచివేయాలని అనైతికమన్నారు. అధికారంలోకి రాకముందు నేను రైతు బిడ్డని రైతులకు మేలు చేసే ప్రభుత్వం అనే గొప్పలు చెప్పి నేడు వైసీపీ ప్రభుత్వం లోకి వచ్చిన తర్వాత రైతుల పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్ కళ్లు తెరిచి రైతు సమస్యల పరిష్కరించి తెలంగాణ ప్రభుత్వం తరహాలో రైతులకు ఎకరాకు రూ.10వేలు అందజేయాలని డిమాండ్ చేశారు.

యాడికి: ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల ధర్నాకు చలో విజయవాడ తరలి వెళ్లకుండా పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం చాలా దారుణమని ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నా మని జిల్లా రైతుసంఘము ఉపాధ్యక్షులు వెంకట రాముడు యాదవ్ ఆదివారం అన్నారు . ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాముడు యాదవ్ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ఈ నెల 8న విజయవాడ నగరంలోని ధర్నా చౌక్ దగ్గర శాంతియుతంగా చేయడానికి జిల్లా నుంచి తరలి వెళ్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు ద్వారా రైతు ఉద్యమాలను అణచి వేయాలని చూడడం చాలా అన్యాయం దీనిని తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు. అరెస్టుల వల్ల భయ భ్రాంతులకు గురి చేయడం ప్రభుత్వానికి మంచి పద్ధతి కాదని ఇప్పటికైనా శాంతియుతంగా ఆలోచించి తక్షణమే అరెస్టులు ఆపాలని రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా రైతు సంఘం తరఫున హెచ్చరించారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 07, ఆగస్టు 2023

దౌర్జన్యంగా పంట తొలగింపు...లబోదిబో మంటున్న రైతు

విశాలాంధ్ర-తలుపుల: వేలాది రూపాయలు ఖర్చు చేసి సాగు చేసుకున్న వేరుశనగ పంట ను దౌర్జన్యంగా నా భూమి తనదంటూ టాక్టర్ తో దున్నేసి పంటను నాశనం చేశారంటూ రైతు వీరాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలుకి వెళితే మండల పరిధిలోని పులిగిండ్లపల్లి పంచాయతీ రజనోల్లపల్లి గ్రామానికి చెందిన రైతు వీరాంజనేయులకు సర్వేనెంబర్ 402-2 నందు 3.49 ఎకరాల భూమిని ప్రభుత్వం తమ వంశీకులకు భూ పంపిణీ చేయడం జరిగిందని, అయితే గతంలో ఆన్లైన్ పద్ధతి లేకపోవడంతో అగ్రంపల్లి గ్రామానికి చెందిన వల్లెపు చిన్న రామన్న అక్రమంగా అన్ ఆన్లైన్ చేయించుకోవడం జరిగిందన్నారు. దీనిపై కోర్టుకు వెళ్లడంతో కోర్టు ఆ భూమి నాకే దక్కే విధంగా కోర్టు తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. దీనితో 50 వేల రూపాయలు ఖర్చు చేసి మా భూమిలో

వేరుశెనగ పంటను సాగు చేస్తే అగ్రహారం పల్లి గ్రామానికి చెందిన చిన్న రామన్న తన అనుచరులతో దౌర్జన్యంగా టాక్టర్ తీసుకొని వచ్చి వేరుసెనగ పంటను దున్నేయడం జరిగిందన్నారు. దౌర్జన్యంగా దున్నేసిన వారిపై చర్యలు తీసుకొని తమకు అధికారులు న్యాయం చేయాలని రైతు వీరాంజనేయులు కోరుతున్నారు.

చలో విజయవాడకు బయలుదేరిన రైతు సంఘం నాయకులు అరెస్ట్

విశాలాంధ్ర - హిందూపురం : పరిధిలోని రైతు సంఘం నాయకులు అరెస్ట్ చేసి నోటీసులు ఇచ్చిన హిందూపురం వన్ టౌన్ పోలీసులు. రైతు సంఘం జిల్లా

ఉపాధ్యక్షులు కెవి.చలపతి మాట్లాడుతూ, రైతులకు సాగు సహాయం పదివేల రూపాయలు అందించాలని, రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, రేపటి రోజున విజయవాడలో తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి బయలుదేరిన వారిని హిందూపూరం రైల్వే స్టేషన్లో అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం నోటీసులు అందించి విడుదల చేశారు.అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, మరింత ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. రైతు సంఘం నాయకులు అక్రమ అరెస్టులును సిపిఐ హిందూపురం పట్టణ కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ ఖండించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోవింద్ రెడ్డి, ఇస్మాయిల్, వెంకటేషప్ప, ఫక్రుద్దీన్, పాల్గొన్నారు.

విశాలాంధ్ర-బత్తలపల్లి: చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతున్న సిపిఐ నాయకులు బత్తలపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కమతం కాటమయ్య, సిపిఐ మండల కార్యదర్శి బండల గోగుల వెంకటేష్ అధ్వరంలో చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతుండగా బత్తలపల్లి పోలీసులు వారిని గృహాల వద్దకు వెళ్లి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం సొంత పూచి కత్తుపై సాయంకాలం విడుదల చేసినారు. వారు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులను నిర్వీర్యం చేసిందన్నారు. కావున ప్రతి రైతుకు ఎకరాకు రూ.10వేలు సాగు ఖర్చులకు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.

గర్జించే గొంతుక కనుమరుగైంది

విశాలాంధ్ర-కదిరి: ప్రజా గాయకుడు, విప్లవ గాయకుడు గద్దర్ తన

స్వరంతో కోట్లాది మందిలో చైతన్యం రగిల్చిన గద్దర్ గర్జించే గొంతుక కనుమరుగైందని ఆయన మృతికి శ్రీ సత్య సాయి జిల్లా సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ సంతాపం తెలియజేసారు.గద్దర్ పిలుపు ప్రజా ఉద్యమం వైపు నడిపించిందని,ఆయన మాట ప్రజల కష్టాలు కళ్ళ ముందు నిలిపిందని పేర్కొన్నారు. నిత్యజీవితంలో ఆయన నిరాడంబర జీవితం గడిపారన్నారు.విప్లవ రచయితల సంఘం,జన నాట్య మండలి ద్వారా ప్రజలను చైతన్యవంతులను చెయ్యడానికి తన స్వరంతో కోట్లాది మందిలో చైతన్యం రగిలించిన గద్దర్ సాహిత్యాన్ని కంఠాన్ని ఎన్నటికీ మరువలేమని, ఆయన మృతి పట్ల ఆయన కుటుంబానికి భారత్ కమ్యూనిస్టు పార్టీ తరఫున వేమయ్య ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బురద కుంటలా మారిన రహదారి

విశాలాంధ్ర-బత్తలపల్లి: స్థానిక ధర్మవరం రోడ్డుకు ఉన్న పబ్లిక్ మరుగుదొడ్ల

ముందర రహదారి మురుగు కుంటలా మారింది. గత 5 సంవత్సరాల క్రితం ఇక్కడ సిసి రహదారిని నిర్మించారు. ప్రస్తుతం వర్షాలు లేనప్పుడు కూడా ఇక్కడ నీరు నిలిచి దుర్వాసన వెదల జల్లుతున్నదంతో స్థానికులు, రహదారి గుండా వెళ్లేవారు ముక్కు మూసుకొని వెళ్తున్నారు. అందులో కూడా నాలుగు రోడ్ల కూడలకి దగ్గరగా ఉండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మురుగును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-ఎన్‌పీకుంట: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశంను మంగళవారం (రేపు) నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఈటె రాము, ఎంపీడీఓ ఆదినారాయణ లు పేర్కొన్నారు. సర్వసభ్య సమావేశంలో మండల వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజల కు మంచినీటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామానికి మంచినీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు సర్పంచులు, మండల స్థాయి అన్ని శాఖ అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశానికి తప్పకుండా హాజరు కావాలని ఎంపీపీ వివరించారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యం

విశాలాంధ్ర - లేపాక్షి : యువత ఎప్పుడు మానసికంగా ఉల్లాసంగా శరీరకంగా దృఢత్వంగా ఉండాలంటే క్రీడలతోనే సాధ్యమని కరణం

రామానంద స్వామి పేర్కొన్నారు. వారం రోజులుగా చోళ సముద్రంలో జైశ్రీరామ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిసు _న్నారు. ఆదివారం మధ్యాహ్నం ఫైనల్ మ్యాచ్‌లో చోళ సముద్రం, కొండూరు, జట్లు పోటీ పడగా కొండూరు జట్టు విజయం సాధించింది. గెలుపొందిన జట్టుకు 20వేల రన్నర్ జట్టుకు 10వేలు నగదుతో పాటు టోర్నమెంట్ ట్రోఫీని కారణం రామా నంద స్వామి క్రీడాకారులకు అందజేశారు. ఈ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన ప్లేయర్లకు మ్యాన్ ఆఫ్ ద సీరియస్, మేనఫ్ ద మ్యాచ్, మెడల్, మెమెంటోళ్లతోపాటు, క్రీడా సామాగ్రిని అందజేశారు. ఏడు రోజులుగా జరిగిన ఈ క్రికెట్ పోటీలలో 16 టీములు పాల్గొన్నట్టు ఆర్గనైజింగ్ సభ్యులు అనిల్ నవీన్ పునీత్ సురేందర్ మోహన్ అశోకులు తెలిపారు. అనంతరం టోర్నమెంట్ కు సహాయ సహకారాలు అందజేసిన దాతను ఘనంగా సన్మానించారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోండి

విశాలాంధ్ర-కొత్తచెరువు: అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా అగ్రిగోల్డ్ అసోసియేషన్ అధ్యక్షులు షబ్బీర్ తెలిపారు. ఆదివారం కొత్త చెరువులో బస్టాండ్ కూడా లేదా కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సంస్థ గతంలో ప్రజలను నమ్మించి ఏజెంట్ల ద్వారా ప్రజల నుండి కోట్లాది రూపాయలు డబ్బులను వసూలు చేసిందని, తరువాత ప్రజలకు డబ్బులు ఇవ్వకుండా దివాలా తీసింది అన్నారు. వైసిపి ప్రభుత్వం ఆదుకుంటామని, గతంలో హామీ ఇచ్చింది గాని వాటిని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. డిపాజిట్లు చెల్లించిన పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. ఆ సమస్తమైన ఇప్పటికైనా చర్యలు తీసుకొని తక్షణమే లబ్ధిదారులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్లు పాల్గొన్నారు.

పలువురు కుటుంబాలను పరామర్శ

విశాలాంధ్ర - నల్లమాడ : మండలంలోని గోపేపల్లి,గోపేపల్లి తండా గ్రామానికి చెందిన పోస్టు వెంకటరెడ్డి, క్రిష్టారెడ్డి, చిన్న నాగప్ప నాయక్, కొత్త పల్లి తండా గ్రామానికి చెందిన శ్రీరాములు నాయక్ అప్పులు బాధతో మృతి చెందిన యర్రవంకపల్లి గ్రామానికి చెందిన సురేష్ రెడ్డి, రెడ్డి పల్లి,వంకర కుంట గ్రామానికి చెందిన నాగప్ప, గోపాల్ రెడ్డి ల అనారోగ్యం, మృతి చెందిన కుటుంబాలను ఆదివారం పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి విస్తృతంగా పర్యటించి వారి కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. కొంతమంది కి ఆర్థిక సహాయం అందజేశారు. ఈయన వెంట మండల కన్వీనర్ కుళ్లాయి నాయక్,సత్యసాయి జిల్లా బీసీ అధ్యక్షులు వి.రమణ, గోపేపల్లి, దొన్నికోట సర్పంచ్ లు రోహిణి రమణారెడ్డి, సరస్వతి నాగరాజు నాయుడు, నాయకులు డి వెంకటరెడ్డి, టీ ఆదినారాయణ రెడ్డి, నారాయణ, ఓబిరెడ్డి తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ గృహాలలో వసతులు మెరుగుపరచాలి

విశాలాంధ్ర - పెనుకొండ : పెనుకొండ ప్రభుత్వ సంక్షేమ హాస్టల్‌ను ఆదివారం హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి విషయాలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో భోజనం ఏర్పాటు బానే ఉన్నాయని, అలాగే హాస్టల్ భవనం కిటికీల మట్టానికి భూమి ఉండడంతో కిటికీల నుంచి పాములు, తేలు లోపలికి వచ్చే ప్రమాదం ఉందని,అలాగే కాంపౌండ్ వాళ్ళు అక్కడక్కడ పడిపోవడంతో చిన్నగా ఉండడంతో ఆకతాయిలు లోపలికి వచ్చి ధూమపానం సేవించడం, చిల్లర పనులు చేయడం వలన పిల్లలకు చదువుల మీద ధ్యాస లేకుండా పోతోంది, వాటిని అరికట్టాలని, హాస్టల్ భవనం చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా లేవని, వసతి గృహం నందు కూడా సౌకర్యాలు తక్కువగా ఉన్నందున విద్యార్థుల సంఖ్య కూడా చాలా తక్కువగా ఉందని, వాటిని మెరుగుపరుచుకోవడానికి హాస్టల్లో పరిశుభ్రంగా

పెట్టడం పరిసరాలను పరిశుభ్రంగా పెంచడం, పిల్లలను సన్మార్గంలో ఉండటానికి ప్రయత్నించడం ఈ యొక్క వసతి గృహాన్ని సౌకర్యాలు మెరుగుపరిచి మంచి నాణ్యమైన విద్యను బోధించడానికి ప్రభుత్వ స్కూలు వెళ్లిన పిల్లల్లో క్రమశిక్షణ పెంచడానికి కృషి చేయాలని ఆయన తెలిపారు. ఆయనతోపాటుగా రామాంజనేయులు ,రవికుమార్ ,నరసింహులు, మూర్తి, ఈశ్వరయ్య ,గంగాధర్, నారాయణ పాల్గొన్నారు.

రైతులకు పరిహారం పునరావసం కల్పించకుండా ప్రాజెక్టు ఎలా నిర్మిస్తారు

విశాలాంధ్ర-బ్యూరో శ్రీ సత్యసాయి : శ్రీ సత్య సాయి జిల్లా ముదిగుబ్బ మండలం గుడ్డం పల్లి తండా సమీపంలో నిర్మిస్తున్న జిల్లెదు బండ ప్రాజెక్టును ధర్మవరం నియోజకవర్గం ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా తెలుగుదేశం పార్టీ నేతలు పరిశీలించారు టిడిపి అధినేత చంద్రబాబు ప్రాజెక్టుపై చేపట్టిన యుద్ధభేరి పేరుతో ప్రాజెక్టుల సందర్శన చేపట్టిన కార్యక్రమానికి కొనసాగింపుగా జిల్లా టిడిపి నేతలు ప్రాజెక్టులు సందర్శన చేపట్టారు టిడిపి అధినేత చంద్రబాబు కదిరి పర్యటనకు వచ్చిన నేపథ్యంలో జిల్లెడు బండ ముంపు గ్రామాల రైతులు వినతిపత్రం అందజేశారు దీనిపై స్పందించిన చంద్రబాబు ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పర్యటించాలని టిడిపి నేతలు ఆదేశించారు ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాకు చెందిన టిడిపి నేతలు ముదిగుబ్బ మండలంలోని గుడ్డం పల్లి తాండ సమీపంలో ఉన్న రిజర్వాయర్ పనులు ఆదివారం పరిశీలించారు స్థానికంగా ఉన్న రైతులు ముంపు బాధితులు నిర్వాసితులతో టిడిపి నేతలు మాట్లాడారు వారి ఇబ్బందులు అభ్యంతరాలను టిడిపి నేతలు తెలుసుకున్నారు అదేవిధంగా ఉమ్మడి జిల్లా టిడిపి నేతలు ఒక్క రూపాయి నష్టపరిహారం, పునరావసం కల్పించకుండా ప్రాజెక్టు ఎలా నిర్మాణం చేపడతారు అంటూ ఆగ్రహ వ్యక్తం చేస్తూ ముంపు బాధితులకు న్యాయం జరిగే వరకూ ధర్నాలు అమరణ నిరాహార దీక్షలు చేపట్టడానికైనా వెనుకాడ బోమం

టూ పేర్కొన్నారు. ముంపు బాధితులు ఉమ్మడి జిల్లా తెలుగుదేశం పార్టీ నేతలకు వినతి పత్రం అందించారు. ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు కాల్వ శ్రీనివాసులు, పార్థసారథి. మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, కందికుంట వెంకటప్రసాద్,తిప్పేస్వామి,బండారు శ్రావణి, ఉమామహేశ్వర్ నాయుడు, ఎమ్మెస్ రాజు, ఆలం నరస నాయుడు, అంబికా లక్ష్మీనారాయణ రాష్ట్ర సాధికార కమిటీల అధ్యక్షులు ముదిగుబ్బ తెలుగుదేశం పార్టీ నాయకులు రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి రమేష్ బాబు మండల కన్వీనర్ కరణం ప్రభాకర్ క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ ముక్తాపురం సర్పంచ్ హరికృష్ణ రైతులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

అధికారులు మారిన...! తీరుమారలేదు

విశాలాంధ్ర - కదిరి : కార్యాలయాలకు చెందిన సమాచార హక్కు బోర్డులో ప్రజా సమాచార అధికారుల పేర్లను మార్చి కొత్త అధికారుల పేర్లను బోర్డులో పొందపరచాల్సిన అధికారులు ఇంతవరకు ఆ ధ్యాసే మరచిపోయారు. ఎన్పీ కుంట మండల తహసిల్దార్ గా జూన్ 22న నరేంద్ర కుమార్ బాధ్యతలు చేపట్టారు. నాటి నుండి నేటి వరకు సమాచార హక్కు చట్టం బోర్డులో నేటికీ సమాచార అధికారిగా గతంలో ఇక్కడ పని చేసిన రవి నాయక్ (డిప్యూటీ తహసిల్దార్)పేరు కూడా మార్పు చెయ్యలేదంటే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఏమిటి ఈ నిర్లక్ష్యం అధికారుల వైఫల్యమే కారణమా? లేక తెలిసిన పట్టించుకోవడం లేదా? అని ప్రజల్లో చర్చనీయం. అధికారులు మారిన కొత్త అధికారుల పేర్లు సమాచార వివరాలు తెలిపే బోర్డు పై అధికారుల పేర్ల మాత్రం ఇంతవరకు బోర్డులో పొందపరచలేదు. ఇది ఎవరి నిర్లక్ష్యం సామాన్యులకు అందుబాటులో ఉంచాల్సిన వివరాలపై కనీస బాధ్యత కూడా లేకుండా వ్యవహరిస్తున్నారని అధికారుల తీరును మండల ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. సమాచార హక్కు చట్టం వచ్చి 18 సంవత్సరాలు కావస్తుంది. ప్రజలకు కనీసం అవగాహన కల్పించాల్సిన అధికారులే నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇకనైనా అధికారులలో మార్పు వచ్చి సమాచార హక్కుచట్టం బోర్డులో కొత్త సమాచార అధికారి పేరు పొందుపరుస్తారో లేదో వేచి చూద్దాం.

శాంతి ర్యాలీని నిర్వహించిన చర్చిల పాస్టర్లు

విశాలాంధ్ర - ధర్మవరం : మణిపూర్‌లో జరిగిన సంఘటనపై నిరసనను తెలియజేస్తూ పట్టణంలోని చర్చిల పాస్టర్లు సంఘ నాయకులు సంఘ పెద్దలు క్రైస్తవులు కలిసి నిరసన ర్యాలీని ఆదివారం మధ్యాహ్నం నిర్వహించారు. ప్లే కార్డ్స్ చేతిన పట్టుకొని ఈ ఘటనను ఖండిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ర్యాలీ గాంధీనగర్ సర్కిల్ నుండి ప్రారంభమై ఎన్టీఆర్ సర్కిల్, కళాజ్యోతి, కాలేజీ సర్కిల్, బస్టాండ్ సర్కిల్ వరకు సాగిన తర్వాత కాలేజీ సర్కిల్ వద్ద ప్రార్థనతో ముగిసింది. ఈ కార్యక్రమం ధర్మవరం యునైటెడ్ ఫాస్టర్స్ వెల్ఫేర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం యునైటెడ్ ఫాస్టర్స్ వెల్ఫేర్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు పాస్టర్ షేక్ మోషస్, కార్యదర్శి పాస్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మణిపూర్ లో జరిగిన ఈ సంఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మణిపూర్ లో జరిగిన దాడులు స్త్రీల మీద జరిగిన అత్యాచారాలను ధమన కాండను ఖండించాల్సిన బాధ్యత అందరిమీద

ఉందని తెలిపారు. మణిపూర్‌లో చర్చిలను కూల్చడం గ్రామాలను తగలబెట్టడం నరకోత జరపడం లాంటి దుశ్చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలని వారు ప్రభుత్వాలు కూడా విచారణ చేపట్టి, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ, కేసులు నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార దర్శి పాస్టర్ సోలెమోను, కోశాధికారి పాస్టర్ గే, పెద్దలు శామ్యూల్, సుందర్ సింగ్, హెరాలీ లైట్ చర్చి పాస్టర్ మల్లెల రమేష్ బాబు సుకుమార్, పట్టణంలోని అన్ని చర్చిల పాస్టర్లు, సంఘ నాయకులు, సంఘ పెద్దలు, విశ్వాసులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పేద ప్రజలకు సేవ చేయడంలోనే సంతృప్తి

విశాలాంధ్ర-ధర్మవరం: పేద ప్రజలకు సేవ చేయడంలోనే సంతృప్తి ఉంది అని యువర్ ఫౌండేషన్ అధ్యక్ష,కార్యదర్శులు వైకే.శ్రీనివాసులు, సుంకు సుకుమార్, కోశాధికారి రాధాకృష్ణ, క్యాంపు చైర్మన్ గర్రె రమేష్ బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం యువర్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో, శ్రీ చక్ర హాస్పిటల్- కర్నూల్ వారిచే ఉచిత కంటి వైద్య శిబిరమును నిర్వహించారు.కర్నూల్ హాస్పిటల్ టెక్నీషియన్స్ రోగులకు కంటి వైద్య చికిత్సలను నిర్వహించి, కంటి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వారు వివరించారు.అనంతరం అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాలే కాకుండా, నేత్రదాన కార్యక్రమం,ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించడం మాకెంతో సంతోషంగా ఉందని తెలిపారు. కంటి శుక్లములు గల వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అర్హులైన వారికి ఆరోగ్యశ్రీ లేదా ఈ హెచ్ ఎస్ నిబంధనలు ప్రకారం ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. శిబిరా దాతలుగా జయంతి గీతా వాణి జయంతి వినోద్ కుమార్ వారి కుమారులు

బి(శ్రీ వెంకటేశ్వర సానిటరీ వేర్ హార్డ్వేర్ అండ్ ఎలక్ట్రికల్స్) వ్యవహరించడం పట్ల వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ శిబిరంలో 60 మంది కంటి రోగులు పాల్గొనగా ఇందులో 40 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక కావడం జరిగిందని వారు తెలిపారు. వీరందరిని ఆదివారము రోజునే సాయంత్రం కర్నూలుకు ఆపరేషన్లకు తరలించడం జరిగిందన్నారు.యువర్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ బి.వి సుబ్బారావు, పోలా ప్రభాకర్, బండ్లపల్లి రంగనాథం, చాంద్బాషా, ఓవి ప్రసాద్, బండి నాగేంద్ర, శీలా నాగేంద్ర, వి ఆర్వో- జయరాం, పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని సంత మార్కెట్ వెనకవైపు గల తొకటవీర క్షత్రియ

కులస్తులైన వల్ల బాబుకు రెండు కిడ్నీలు చెడిపోయి మంచం మీదే లేవలేని పరిస్థితిలో ఉన్నా దన్న విషయాన్ని చౌడేశ్వరి దేవి సేవా సమితి వారి ద్వారా తెలుసు కున్న పట్టణ తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షులు బండారు ఆదినారాయణ,ప్రధాన కార్యదర్శి శంకర యుగంధర్ తో పాటు కమిటీ సభ్యులు వల్లా బాబు ఇంటికి వెళ్లి పరామర్శించి కిడ్నీలు ఏ విధంగా దెబ్బతిన్నాయి అన్న అనారో గ్య విషయాన్ని కూడా తెలుసుకొని బాధపడ్డారు. అనంతరం 20వేల రూపాయల ను ఆర్థిక సహాయాన్ని వారు అందించారు. మున్ముందు కూడా ఈ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బాలం శ్రీనివాసులు,దాసరి మంజునాథ్,మామిళ్ల సత్యనారాయణ,సిద్ధినాథంచంద్రశేఖర్, గట్టు నాగభూషణం, బంధనాదం రమణ, నీలూరి సత్యనారాయణ, పామి శెట్టి వెంకటేష్ పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రానికి ఆర్టీసీ బస్సు ఏర్పాటు

విశాలాంధ్ర - ధర్మవరం : ఈనెల 30వ తేదీ శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఉదయం ఐదు గంటలకు ధర్మవరం నుండి కాణిపాకం, అరకొండ, ఆంజనేయస్వామి, తన్గల్ వెంకటేశ్వర స్వామి, పున్నై రత్నగిరి మీదుగా అరుణాచలం గిరి ప్రదర్శన శివుని దర్శనం చేసుకునేందుకు ఆర్టీసీ బస్సును నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ మోతిలాల్ నాయక్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తిరుగు ప్రయాణంలో వేలూరు గోల్డెన్ టెంపుల్ మీదుగా కంచి (శివకంచి విష్ణు కంచి, బంగారు బల్లి) ని దర్శించుకుని, ధర్మవరంకు రావడం జరుగుతుందని తెలిపారు. ఇందుకు గాను ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పై క్షేత్రములు దర్శించుకుని వచ్చుటకై రానుపోను ఎక్స్ప్రెస్ చార్జీలు 1200 రూపాయలు, అదేవిధంగా సూపర్ లగ్జరీ సర్వీసులో అయితే రాను పోను చార్జీలు 1600 రూపాయలు ఉంటుందని తెలిపారు. టికెట్ల రిజర్వేషన్ తోపాటు ఆన్లైన్ సౌకర్యం కూడా కలదని తెలిపారు. ఈ సదా అవకాశాన్ని భక్తాదులందరూ వినియోగించుకోవాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సెల్ నెంబర్ 7382860947 కు సంప్రదించాలని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-లేపాక్షి: లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయం నందు ఈనెల 3వ తేది నుండి 5వ తేది వరకు జరిగిన రీజినల్ స్థాయి టేబుల్ టెన్నీస్ పోటీల్లో గెలుపొందిన 30 మంది విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎం.నాగరాజు ఆదివారం పేర్కొన్నారు. ఇందులో 8 క్లస్టర్లు పాల్గొనగా అన్నీ క్లస్టర్ల నుండి ఉత్తమ ఆటగాళ్లను జాతీయ స్థాయికి ఎంపిక చేసినట్టు ఆయన పేర్కొన్నారు. అండర్-14, అండర్-17,అండర్-19 విభాగాల్లో 5 మందిని ఎంపికైయ్యారని తెలిపారు. చిత్రదుర్గ, కలబుర్గి, కృష్ణా, కర్నూలు, మహబూబ్ నగర్, తిరువనంతపురం, తుముకూరు, వాయునాడ్ క్లస్టర్ల నుండి ఆరుమంది బాలురు, ఆరుమంది బాలికలు పాల్గొన్నట్టు వివరించారు.బాలురు విభాగంలో అండర్-14లో తరుణ్(వాయు నాడ్), అండర్ -17లో గగన్ శ్రీ (తూర్పుగోదావరి-1), అండర్-19లో కెకెఎం.స్వామి (తూర్పుగోదావరి-1) ఎంపికయ్యా రని తెలిపారు. అదేవిధంగా బాలికల విభాగంలో అండర్-14లో ఎం. వాత్సల్య(తూర్పుగోదావరి-1),అండర్-17లో ఎంఎస్ శ్రేయ (చిక్కమంగళూరు),అండర్-19లో హాసిని (తూర్పుగోదావరి-1) ప్రథమ స్థానంలో నిలిచారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఆటగాళ్లు లేపాక్షి నవోదయ విద్యాలయంలో శిక్షణ పొందిన అనంతరం ఛత్తీస్ ఘడ్ లోని రాయపూర్ నవోదయ విద్యాలయంలో సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటారని పేర్కొన్నారు.

రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తుంది

విశాలాంధ్ర-ధర్మవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తుందని పోలీసులు కూడా వైసిపి కార్యకర్తగా ప్రవర్తిస్తుండడం దారుణమని శ్రీ సత్యసాయి జిల్లా తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి తిరుమలేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అక్రమ అరెస్టులు జరుగుతున్నాయని తెలిపారు.మాజీ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు మదనపల్లె పర్యటన లో అంగళ్లు గ్రామం వద్ద చోటు చేసుకున ఉద్రిక్తత లో టీడీపీ నేతల మీద పలు కేసులు నమోదు చేయడం సరి అయింది కాదని తెలిపారు. పోలీసులు నమోదు చేసిన కేసులలో పలమనేరు ఇంఛార్జి అమరనాథ్ రెడ్డి, పీలేరు ఇంఛార్జి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి , తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, రాజంపేట పార్లమెంట్ ఎం.పీ అభ్యర్థి గంట నరహరి మీద అక్రమంగా కేసులు నమోదు చేయడం దారుణమని తెలిపారు. నియంత పాలనలో అక్రమ అరెస్టులు రోజు రోజుకీ మితిమీరిపోతున్నాయి అని, వైఎస్సార్సీపీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయి అని హెచ్చరించారు. ఏదోక విధంగా టీడీపీ నేతలను అరెస్టు చేయాలి అనే కుతూహలం పోలీసు వారి దగ్గర స్పష్టంగా కనపడుతోందని తెలిపారు. పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కన్నుసన్నలోనే వీరి మీద అక్రమ కేసులు పెట్టడం జరిగింది అని తెలిపారు. రాష్ట్ర ప్రజల కోసం చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేస్తూ ఉంటే, అదే పనిగా పనిగట్టుకుని, ఇలాంటి ఘటనలకు పాల్పడం ఇకనైనా మానుకోవాలని హితువు పలికారు.

బాబు బాలాజీ కి పురస్కార అవార్డు బిరుదు ప్రధానం

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరంలో లలిత నాట్య కళానికేతన్ నాట్యచార్యులు అయిన బాబు బాలాజీ 30 సంవత్సరాలుగా నాట్య కలను వేలాదిమంది విద్యార్థులకు నేర్పిస్తూ తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం ఏలూరు పట్టణంలో అఖిలభారత బ్రాహ్మణ మహాసంఘం వారు వీరు చేస్తున్న సేవలను గుర్తించి, "ఉత్తమ గురు పురస్కారం" అనే పురస్కార అవార్డు బిరుదు ను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా బాబు బాలాజీ మాట్లాడుతూ తాను సేవా కార్యక్రమంలో బాల, బాలికలకు నాట్య కలను నేర్పడం నా పునర్జన్మ సుకృతముగా భావిస్తున్నానని తెలిపారు. మా నాట్య కళలను రాష్ట్రంలోని పలు జిల్లాలు లో ప్రదర్శించడం జరిగిందన్నారు. మా నాట్య కళలను గుర్తించి, అఖిలభారత బ్రాహ్మణ మహాసంఘం వారు, గురు పౌర్ణమి పురస్కరించుకొని రాష్ట్ర అధ్యక్షులు ఇంద్రకంటి ప్రసాదు శర్మ, ముఖ్య అతిథి ఎండోమెంట్ బ్రాహ్మణ సమైక్య గౌరవ సలహాదారులు జ్వాలా పురం శ్రీకాంత్ చేతుల మీదుగా అందుకోవడం జరిగిందన్నారు. అనంతరం అందరి సమక్షంలో నన్ను ఘనంగా సత్కరించడం నాకెంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. నా నాట్య కళలు మున్ముందు మరింతగా విస్తరింప చేస్తానని తెలిపారు.

ఆశ్రమానికి విరాళం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ధర్మశాస్త్ర కాశీనాయన ఆశ్రమం దాతల సహకారంతో దినదినాభివృద్ధి జరుగుతుంది. ఇందులో భాగంగా ఆదివారం 16వ వార్డు (శివానగర్) కౌన్సిలర్ కేత లోకేష్ ఆశ్రమ అభివృద్ధి కొరకు తనవంతుగా 25 వేల రూపాయల నగదును కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కేత లోకేష్ మాట్లాడుతూ ఎంతోమంది అనాధలకు, పేదలకు ఆశ్రయాన్ని ఇవ్వడం, నిజంగా దైవ సేవతో సమానమని తెలిపారు. ఇటువంటి ఆశ్రమానికి తన సేవగా ఈ నగదును ఇవ్వడం నాకెంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. అనంతరం ధర్మశాస్త్ర కాశీనాయన మందిరం అధ్యక్షులు కనేకంటి శివారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శంకర చౌడప్పలు దాత అయిన కేత లోకేష్ కు అభినందన కృతజ్ఞతలను తెలియజేస్తూ, కౌన్సిలర్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సభ్యులు పాల్గొన్నారు.

అశ్రునివాళి



ప్రజా గాయకుడు గద్దర్ గారి మృతి తీరనిలోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపమును తెలియజేస్తూ...
పట్టణ గాయకులు మరియు అభిమానులు
ధర్మవరం, శ్రీ సత్యసాయి జిల్లా.

విశాలాంధ్ర దినపత్రికకు 71 వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ధర్మవరం RTC డిపో YSR ఎంప్లాయీస్ అసోషియేషన్
ధర్మవరం, శ్రీ సత్యసాయి జిల్లా.
C.నాగేంద్ర - జిల్లా అధ్యక్షులు
S.శీనయ్య - డిపో కార్యదర్శి
A.ముత్యాలప్ప - డిపో అధ్యక్షులు